

# అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గురువారం 25 సెప్టెంబర్ 2025 పేజీలు : 04


# రూ. 1.51 కోట్లతో ఫ్యాషన్ డిజైన్ పై శిక్షణ కేంద్రం మంజూరు



సమావేశంలో మంత్రి సవితమ్మ, బాలయ్య తదితరులు

**హిందూపురం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఫ్యాషన్ డిజైన్లపై చేనేతలకు ఆధునిక శిక్షణ ఇచ్చేందుకు రూ. 1.51 కోట్ల వ్యయంతో ఎస్డిబీ శిక్షణ కేంద్రం మంజూరు చేసినట్లు రా ష్ట్రరాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వెల్లడించారు. ఆధునిక దుస్తుల తయారీలో శిక్షణిచ్చేలా కేంద్ర ప్రభుత్వం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రొగ్రామ్(ఎస్సీడీపీ) మంజూరు చేసినట్లు వెల్లడించారు. విజయవాడలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి సంబంధించిన వివరాలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ శిక్షణ కేంద్రంలో 292 మంది నేతన్నలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. నిపుణులు, ఫ్యాషన్ డిజైన్లతో చేనేతలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. మరోవైపు పట్టుసాగు పెంచేలా రైతులకు అవగాహన కల్పిస్తామని కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి హిందూపురంలో స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రొగ్రామ్ (ఎస్సీడీపీ) ఏర్పాటుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. రూ. 1.51 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఎస్సీడీపీకి కేంద్రం రూ.1.44 కోట్లు, లబ్ధిదారులు రూ.7.12 లక్షలు వాటాగా ఇవ్వనున్నారన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్.హెచ్.డి.పి) కింద కేంద్ర ప్రభుత్వం హిందూపురానికి ఎస్సీడీపీ మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా నేతన్నలకు ఉపాధి లభించడంతో పాటు వారికి నేటితరం అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో శిక్షణ ఇవ్వనుమన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ నూతన చేనేత దుస్తుల తయారీలో నిపుణులు, ఫ్యాషన్ డిజైనర్లతో నేతన్నలకు శిక్షణిచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుత తరం ఆలోచనలు, ఫ్యాషన్ ను దృష్టిలో పెట్టుకుని చేనేత దుస్తుల రూపకల్పనపై నేతన్నలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. నేతన్నలకు గౌరవప్రదమైన జీవనం అందించడానికి ఎస్సీడీపీ ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, సెరీ కల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. హిందూపురంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి హిందూపురం చిలమత్తూర్ మండలం టేకులోడు ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పాలని రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోరారు. జె కే ఏరోస్పేస్, డిఫెన్స్ సంబంధిత పరిశ్రమల ఏర్పాటుకు చిలమత్తూరు మండలం టేకులోడు ప్రాంతం అనువుగా ఉంటుందని వివరించారు.

# వాల్మీకులను ఎస్టిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి

**రాయదుర్గం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



కాల్వ శ్రీనివాసులు

ఆరు దశాబ్దాలుగా సామాజిక హోదా కోసం చెకోరి పక్షుల ఎదురుచూస్తున్న వాల్మీకులను ఎస్టిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు శాసనసభలో ముఖ్యమంత్రి శాసనసభ ద్వారా కోరారు ఈ మేరకు బుధవారం శాసనసభ ప్రసత్రాల సమయంలో ఆయన వాల్మీకుల గురించి వాల్మీకులను ఎస్టిలో చేర్చే విషయంపై సుదీర్ఘ చర్చ మాట్లాడారు ఏపీలో ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని మొట్టమొదటగా సూచనలు చేసిన మహా నాయకుడు ఎన్టీరామారావు అని అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2017 డిసెంబర్ 2న అసెంబ్లీలో తీర్మానం చేసి ఏకగ్రీవ తీర్మానం చేసి ఎస్టిలో చేర్చాలని కేంద్రానికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు అయితే కేంద్రంలో ఆరు అభ్యంతరాలు చెప్పినందుకు వాటిని తిరిగి పంపడంలో ఆలస్యం అయిందన్నారు వాటిని తిరిగి పంపడంలో ఆలస్యమైంది ని తెలిపారు దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న వాల్మీకి బోయలు ఎస్టీ జాబితాలో ఉన్నారని అదేవిధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా ఎస్టీలను చేర్చాలని ఆయన కోరారు వాల్మీకి వాల్మీకి బోయలను ఎస్టిలో చేర్చాలని సంపూర్ణ మద్దతు తెలిపిన రాయబర్మన్ 1961 లోనే ఆయన

**శాసనసభలో కాల్వ శ్రీనివాసులు**

పుస్తకాల్లో రాసి ఉన్నారని అనంతరం ట్రైబుల్ కమిషన్ కమిటీ సత్యపాల్ కమిషన్ కూడా వారి పుస్తకాల్లో ప్రస్తావించారని పేర్కొన్నారు అయితే 2019 అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ గవర్నమెంట్ ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా మళ్లీ ఏకపక్షంగా రాయలసీమను ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండా మళ్లీ ఏకపక్షంగా రాయలసీమ లో ఉన్న వాల్మీకులను మాత్రమే ఎస్టిలో చేర్చే విధంగా తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఉన్న వాల్మీకి బోయలను పరిస్థితుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు వచ్చే నెల 7వ తారీకు అక్టోబర్ ఏడో తారీఖున వాల్మీకి బోయలు ఆనందంగా జయంతి జరుపుకోవాలని ఆ సమస్య ఎదుర్కొంటూ బాధతో గడపాలో మీరే నిర్ణయం తీసుకోవాలని ఈ విషయంపై వాల్మీకి నాయకులైన పార్థసారథి జయరాంతో చర్చించినట్లు ఆయన తెలిపారు ఎట్టి పరిస్థితుల్లో 2017 డిసెంబర్ 2 తీర్మానానికి కట్టుబడి ఉన్నట్లు సాంకేతిక ఇవ్వాలని కేంద్రంలో ఉన్న పెద్దలతో చర్చలు జరిపి ఒప్పించి వాల్మీకి బోయలను ఎస్టిలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

# ఆయా ప్రాజెక్ట్ లకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలి

**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

జిల్లాలో ఆయా ప్రాజెక్ట్ లకు సంబంధించి భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణపై సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఆయా శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే, ఏపీ జెన్కో, ఏపీఐఐసి, ట్రాన్స్ కో, సోలార్ పార్కులు, నేషనల్ హైవే 544డి పేజ్ 1, 2, నేషనల్ హైవే 42, 67, ఆర్.అండ్.బికి సంబంధించి చేపట్టాల్సిన భూసేకరణ, భూ బదలాయింపులపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, భూ బదలాయింపులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాడిపత్రి పరిధిలోని తలారి చెరువు, ఆలూరు పరిధిలో సోలార్ పార్క్ కి సంబంధించి తహసిల్దార్, జెన్కో వారు ఇద్దరూ కలిసి డీకేటి నివేదికను గురువారంలోగా అందించాలన్నారు. ఏపీఐఐసీ పరిధిలో రాప్తాడు ఎంఎస్ఎంఈ పార్కుకు సంబంధించి ప్రభుత్వ భూమిని గుర్తించాలని తహసిల్దార్, ఆర్డీఓలను ఆదేశించారు. నేషనల్ హైవే అథారిటీకి సంబంధించి పిపిటి ద్వారా ఎక్కడెక్కడ ఎంతెంత పని పూర్తి అయ్యింది అనేది సమీక్షించడం జరిగింది. ఈ సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, తిప్పేనాయక్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్.హెచ్ పిడి తరుణ్, ఆయా శాఖల అధికారులు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబానికి మహిళ వెన్నెముక లాంటిది

**- వైద్య శిబిరాల ద్వారా ముందస్తుగానే పరీక్షలు చేయించుకోవాలి**

**- వైద్య శిబిరాల ద్వారా అవగాహన పొందాలి: జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్**



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



మహిళలతో వారి ఆరోగ్య పరిస్థితులను విచారిస్తున్న కలెక్టర్

**శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) సెప్టెంబరు,24 ప్రభాతవార్త:**

ప్రతి మహిళ కుటుంబానికి వెన్నెముక లాంటిదని, మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం, ఆ ఊరు, ఆ మండలం, ఆ జిల్లా, ఆ రాష్ట్రం, ఆ దేశం సుఖ సంతోషాలతో ఉంటుందని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ అన్నారు.బుధవారం కొత్తచెరువు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి "స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నెలకు రెండు లేక మూడు వైద్య శిబిరాలను నిర్వహించుకోవడం జరుగుతోందని అన్నారు. ఈ మారు ప్రత్యేకతగా దేశ ప్రధానమంత్రి " స్వస్థ నారి సశక్తి పరివార్ అభియాన్" కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కుటుంబానికి మహిళ వెన్నెముక లాంటిదని అన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే తన కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని అలాగే మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుంది, ఊరు బాగుంటుంది, జిల్లా బాగుంటుంది, రాష్ట్రం బాగుంటుంది, దేశం కూడా బాగుంటుందని అన్నారు. మహిళలకు ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలని అన్నారు. వైద్య శిబిరాలు ఆరోగ్యాలు సరిగా లేనప్పుడు వారు మాత్రమే వస్తారని అలా కాకుండా ముందస్తుగానే పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. రొమ్ము క్యాన్సర్ రాకుండా ఏం చర్యలు తీసుకోవాలి, గైనిక్ సమస్యలు రాకుండా ఏమి చర్యలు తీసుకోవాలి, టీబి, మధుమేహ వ్యాధి తదితర రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పూర్వికులు గతంలో ఆరోగ్యకరమైన రాగిసంకటి, జొన్న సంకటి తదితర ఆహారాన్ని తీసుకునేవారని ఆరోగ్యంగా ఉండే వారిని అన్నారు. ప్రస్తుతం మనలో ఆహార అలవాట్లు మారాయని, కష్టపడడం కూడా తగ్గిపోయిందని, అందువల్ల రోగాలు కూడా పెరిగిపోవడం జరుగుతోందని అన్నారు. మనమందరం మంచి లైఫ్ స్టైల్ ను అలవాటు చేసుకోవాలని అన్నారు. ఏ రోగాలు రాకుండా ఏమి జాగ్రత్తలు తీసుకోవాలన్న మెడికల్ క్యాంపుల ద్వారా తెలుసుకోవాలని అన్నారు. మెడికల్ క్యాంపులందు ప్రివెన్షన్ ఫోకస్ చేస్తే బాగుంటుందని అన్నారు. ఆరోగ్య శ్రీ సత్య సాయి జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. చివరిగా కలెక్టర్ వెలుతు వృద్ధురాలితో మాట్లాడుతూ కంటి ఆపరేషన్ చేసుకున్నారా?, ప్రస్తుతం ఎలా ఉంది?, డాక్టర్లు చూస్తున్నారా?, అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే త్వరలో కంటికి సంబంధించిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అప్పుడు ప్రత్యేకంగా కంటి పరీక్షలు చేయడం జరుగుతాయని కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజా బేగం, డి సి హెచ్ ఎస్ మధుసూదన్, డాక్టర్ అశ్వత్ కుమార్, డాక్టర్ జాయిలీ వెస్లీ, డాక్టర్ భార్గవ్, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ హారిక, డాక్టర్ జయశ్రీ , ఎంపీడీవో నటరాజ్ వైద్యులు వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలి

**2025-26 మొదటి త్రైమాసికానికి రూ.5646.37 కోట్ల రుణాలు మంజూరు**

**వ్యవసాయ రుణాలలో రూ.3217 కోట్లు, ప్రాధాన్యత రంగంలో రూ.4566 కోట్లు మంజూరు : జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**శ్రీ సత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా ఆర్థిక ప్రగతికి, సమాజ అభివృద్ధికి బ్యాంకర్లు విరివిగా రుణాలు అందించాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డి సి సి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డి ఎల్ ఆర్ సి) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు మొదటి త్రైమాసికం ముగిసేనాటికి నిర్దేశించిన పలురకాల ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమన్నారు. జిల్లాలో 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షికంగా రూ.14051 కోట్ల రుణాలు అందజేయడం లక్ష్యం. కాగా మొదటి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ క్రింద రూ.5646.37 కోట్ల రుణాలు మంజూరు చేసి 40.18 శాతం ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. వ్యవసాయ రుణాలలో రూ.3217 కోట్లు మంజూరు చేసి 42.41శాతం, ప్రాధాన్యత రంగంలో రూ.4566 కోట్లు మంజూరు చేసి 37.84 శాతం ప్రగతి సాధించారన్నారు. పుట్టపర్తి జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లా. ఈ రంగంలో వ్యవసాయ,అనుబంధ రంగాలలో రుణాలను విరివిగా అందజేయాలన్నారు. సి సి ఆర్ సి రుణాలలో అనుకున్న మేర లక్ష్యాలను సాధించలేదని, ఇందులో నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా అధిగమించాలన్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాలలో భాగంగా ఎంఎస్ఎంఈ సెక్టార్ కు సంబంధించి రూ.524 కోట్లు మంజూరు చేశారని, దీన్ని మరింత మెరుగుపరచాలని ఆర్బిఐ సూచించిన మేరకు రుణకల్పన ఉండాలని అన్ని బ్యాంకులకు సూచించారు. ముఖ్యంగా జన స్మార్ట్ పోర్టల్ ద్వారా అన్ని రుణాల దరఖాస్తులను బ్యాంకులకు పంపించాలని సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా డిఆర్డిఏ మెప్మా శాఖలు సమన్వయంగా సంఘాలకు అవగాహన కల్పించి పదివేల దరఖాస్తులను జన స్మార్ట్ పోర్టల్ ద్వారా బ్యాంకులకు చేరవేయాలని సూచించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలకు (పిఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్ప్రెనార్స్ పి ఎం ఎఫ్ ఎం ఈ) రుణాలు మంజూరు చేయాలని, అలాగే పీఎం సూర్య ఘర్ రుణాలులో ఇప్పటివరకు 253 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.5కోట్లు మంజూరు కాగా, 232 దరఖాస్తులకు రూ.3.66 కోట్లు మంజూరు చేశారని మిగిలినది కూడా లక్ష్యం మేరకు అందజేయాలన్నారు. విద్యా రుణాలు, గృహ రుణాలలో లక్ష్యం మేరకు మంజూరు శాతం పెంచాలని తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత పై విస్తృత అవగాహన కల్పించాలని ఎల్డీఎంకు సూచించారు. ముద్ర రుణాలు, పీఎం విశ్వకర్మ, స్టాండ్ అప్ ఇండియా పథకంలలో ప్రగతిలో వెనుకబడకుండా లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే.. ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రగతి సాధనలో తిరోగమనంలో ఉన్న ఆయా బ్యాంకు శాఖలు అందుకు కారణాలను తెలియజేయాలన్నారు. అలాగే.. బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన "స్టాండప్ ఇండియా", ముద్ర, గ్రామీణ ఖాదీబోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు.. పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా.. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, డిసిసి, డిఎల్ఆర్సి సమావేశం కు సంబంధించిన అజెండా వివరాలను, ఆయా అంశాలలో బ్యాంకుల సాధించిన ప్రగతిని కలెక్టర్ కి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు రమణ కుమార్, ఆర్బిఐ మేనేజర్ రోహిత్ అగర్వాల్, నాబార్డ్ ఏజీఎం అనురాధ , ఆర్సెట్టి డైరెక్టర్ శాంతి ప్రియ, వివిధ బ్యాంక్ మేనేజర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, డిక్కీ, డిఐపి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల సమస్యలను పరిష్కరించండి

**- అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి - 150 కోట్లు మంజూరు చేయాలని కోరిన ఎమ్మెల్యే సునీత**



అసెంబ్లీలో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

రాప్తాడు నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన సమావేశాల్లో జీరో అవర్లో ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇప్పటికే చాలా చోట్ల రోడ్ల సమస్యలు లేకుండా చేసినప్పటికీ ఇంకా కొన్ని రోడ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. అనంతపురం సమీపంలోని టమోటా మండీల దగ్గర నుంచి వయా కనగానపల్లి మీదుగా చిగురచెట్టు వరకు, తగరకుంట నుంచి ఎగువపల్లి, తగరకుంట నుంచి నూతిమడుగు, ఈనాడు ఆఫీస్ దగ్గర నుంచి చిగిచర్ల వరకు ఉన్న ప్రధాన రోడ్లు వేయాల్సి ఉందన్నారు. ముఖ్యంగా యాలేరు తగరకుంట గ్రామాల మధ్యలో ఓపెన్ చేసిన రోడ్డు పనులు ప్రస్తుతం ప్రారంభించామన్నారు. ఇంకనూ సుమారుగా 15కిలోమీటర్ల రోడ్డు పనులు నిధులు లేక ఆపాల్సి వస్తోందన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు సౌకర్యం కోసం మరియు నియోజకవర్గంలోని ఇతర రోడ్ల నిర్మాణాలకు సుమారు 150కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఇబ్బంది దృష్ట్యా దీనిని వెంటనే పరిగణలోకి తీసుకోవాలన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు





నిమ్మలరామానాయుడు కుమార్తె వివాహ వేడుకల్లో మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపిలు

**అనంతపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త బ్యూరో**

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం జరిగిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆహ్వానం మేరకు వారి కుమార్తె శ్రీజ, దుర్గా హరిహర సాయి పవన్ కుమార్ల వివాహ రిసెప్షన్ వేడుకకు అనంతపురం జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకుల హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.. మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు బి కే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, దగ్గుబాటి వెంకటప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఏడిసి బ్యాంక్ అధ్యక్షులు ముంటి మడుగు కేశవరెడ్డి, టిడిపి నాయకుడు రామలింగారెడ్డి తదితరులు నూతన దంపతులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యేలు, ఎంపీలను మంత్రి రామానాయుడు ఆప్యాయంగా పలకరించారని టిడిపి నేతలు చెబుతున్నారు.

# ముదిగుబ్బలో దౌర్జన్యకాండ..!

**- పట్టపగలే జర్నలిస్టు ఇంటి ప్రహారీ ధ్వంసం**



ప్రహారీ గోడను దౌర్జన్యంగా కూల్చివేస్తున్న దృశ్యం

**ముదిగుబ్బ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ముదిగుబ్బ పట్టణంలో పట్టపగలే దౌర్జన్యకాండ జరిగింది. స్థానిక వార్త విలేకరి సూర్యనారాయణ కు చెందిన ఇంటి ప్రహారీ గోడను దౌర్జన్యంగా కూల్చివేశారు. ఈ భూమి గత కొంతకాలంగా కోర్టు వివాదంలో నడుస్తోంది. కోర్టు పరిధిలో ఉన్న ఈ ప్రహారీ గోడను సర్వేయర్ గా పనిచేస్తున్న అంజి నాయక్ అతని సోదరుడు పోలీస్ కానిస్టేబుల్ బాలాజీ నాయక్, మరి కొంతమంది కలిసి బుధవారం ఉదయం ఇంట్లో ఎవరీ లేని సమయంలో కూల్చివేశారని బాధితుడు సూర్యనారాయణ వాపోయారు. వ్యక్తిగత పనులపై కొత్తచెరువుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్ళామన్నారు. ఇదే అదునుగా భావించిన దౌర్జన్యకారులు ఇంటి వద్దకు వెళ్లి గడార్లు, గుణపాలతో ప్రహారీ గోడను కూల్చివేశారు. తనకు జరిగిన అన్యాయంపై ముదిగుబ్బ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని బాధితుడు సూర్యనారాయణ వాపోయారు. ఈ సందర్భంగా బాధితులు సూర్యనారాయణ మాట్లాడుతూ గత కొంతకాలంగా ముదిగుబ్బ కు చెందిన సర్వేయర్ గా పనిచేస్తున్న అంజి నాయక్ తమకు మధ్యలో ఉన్న భూమి కోర్టు వివాదంలో ఉందన్నారు. దీనిపై తనకు న్యాయస్థానం స్టే కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అయితే బుధవారం ఉన్నపలంగా ఇంటిని దౌర్జన్యంగా కూల్చేసారని ఆవేదన చెందారు. ఎంతో కాలంగా కోర్టు వివాదంలో ఉన్నందున న్యాయస్థానం మేరకు తాము నడుచుకుంటామని తెలియజేశారు. ఇదిలావుండగా దౌర్జన్యపరులు ఇలా దౌర్జన్య కాండకు పాల్పడ్డారని వాపోయారు. ఈ విషయమై పోలీసులకు, ఇతర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో సమగ్రంగా పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు. కోర్టు దిక్కరణ చేసి పట్టపగలే ఇలాంటి దారుణానికి ఒడిగట్టిన నిందితులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.


సోమందేపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

మహానందరెడ్డీ ఖబడ్దార్.. ఎమ్మెల్యే అనుకుంటే స్వేచ్ఛగా తిరిగేవాడివా...

4 >>

రాష్ట్రపతిని కలిసిన జాతీయ అవార్డు గ్రహిత జూజారే నాగరాజు...!

పిజిఆర్ఎస్ అర్జీలు పరిశీలించిన ఆర్డీవో

02ATP27_02ATP27.qxd 24-09-2025 PM 10:46 Page 1



## రాష్ట్ర సమీక్షలో వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ హాజరు

హిందూపురం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



పార్టీ అధినేతతో దీపిక

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం బుధవారం విజయవాడ తాడేపల్లి లోని ఆ పార్టీ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి హిందూపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ దీపిక వేణురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డితో ఆమె మర్యాదపూర్వకంగా కలిసి నియోజకం లో పెద్ద ఎత్తున చేస్తున్న కార్యక్రమాలను వివరించినట్లు చెప్పారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, మధుమతి రెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

## నేడు స్వచ్ఛతాహి సేవకు కలెక్టర్ రాక

హిందూపురం టౌన్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



సమస్యలు వివరిస్తున్న ఫైరోజ్

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా స్వచ్ఛతహి సేవ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా హిందూపురంలో గురువారం జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా నూతన కలెక్టర్ హాజరవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మార్కెట్‌యార్డ్, హౌసింగ్‌బోర్డ్ ప్రాంతాలను బుధవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో ట్రేడర్లు ఫైరోజ్ తదితరులు కమిషనర్ ను కలిసి స్థానిక సమస్యలను వివరించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, పారిశుద్ధ్యంకు చర్యలు తీసుకోవాలని కోరగా కమిషనర్ హామీ ఇచ్చారు. కాగా హౌసింగ్ బోర్డ్ లో జరగనున్న శ్రమదానం కార్యక్రమంలో ఉదయం 8గంటలకు జిల్లాకలెక్టర్ హాజరుకానున్నారు.

## ఎంపిడిఓగా పదోన్నతి బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓ

గుమ్మఘట్ట సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఓ జయరాములు

గుమ్మఘట్ట మండల నూతన ఎంపీడీఓగా బాధ్యతలను స్వీకరించిన జయరాములు. ఆయన వజ్రకరూరు పరిపాలన అధికారి పోస్టు నుంచి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో గుమ్మఘట్ట మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏవోగా పని చేసారు వజ్రకరూరు లో ఏవో నుంచి ఎంపిడిఓగా పదోన్నతి పొంది గుమ్మఘట్ట మండలం లోని బుధవారం బాధ్యతలు స్వీకరించారు మండల ప్రజలకు సందేశమిస్తూ అందుబాటులో ఉండి ప్రజాప్రతినిధులు కు అధికారులు సహాకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో లో నడిపిస్తానని తెలిపారు.

## వెలుగు యానిమేటర్ల కు బయోమెట్రిక్ డివైజర్ పంపిణీ

బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



బయోమెట్రిక్ పంపిణీ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండలం కేంద్రంలోకళ్యాణ్ దుర్గం శాసనసభ్యులు సురేంద్ర బాబు ఆదేశాల మేరకు కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం ఉన్న వెలుగు సంస్థలో పనిచేస్తున్న 38 మంది వి ఓ ఎ యాని మేటర్ లకు మండల అధ్యక్షులు పాల బండ్ల శ్రీరాములు గారు జడ్పిటిసి ప్రభావతి గారు తో కలిసి ప్రభుత్వం నుంచి మంజూరు అయిన బయోమెట్రిక్ డివైస్ లను పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వం ఎంతో నమ్మకంగా పంపిణీ చేసిన బయోమెట్రిక్ డివైస్ లను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభావతి సర్పంచ్ వనిత మల్లికార్జున రైతు సంఘం అధ్యక్షుడు గౌడ ఏపిఎం నారప్ప, వెంకటేశులు వెలుగు అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## నింగమ్మ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు

బ్రహ్మ సముద్రం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం మండల పరిధిలోని ఎరడికేర గ్రామం నందు అంగన్వాడి కార్యకర్తగా విధులు నిర్వహించిన నింగమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలిసికొన్న మండల కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు ఎరడికెర వెళ్ళి నింగమ్మ పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సభ్యులకు భరోసా కల్పిస్తూ పార్టీ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని తెలియ చేశారు ఈ కార్య క్రమంలో స్తానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పవన్ "ఓజి" సినిమా...గోరంట్లలో 20 వేలకు టికెట్ దక్కించుకున్న మెగా అభిమాని ముని

గోరంట్ల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ నటించిన ఒరిజినల్ గ్యాంగ్ స్టార్ (ఓజి) సినిమా మొదటి టికెట్ వేలం పాటలో గోరంట్ల మండల కేంద్రానికి చెందిన మెగా వీరాభిమాని డిజె మునిస్వామి 20 వేల రూపాయలకు వేలం పాటలో దక్కించుకుని పవన్‌కళ్యాణ్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని చంద్రశేఖర్ థియేటర్ కాంప్లెక్స్‌లో పవన్‌కళ్యాణ్ నటించిన ఓజి సినిమా విడుదల నేపథ్యంలో థియేటర్ ఆవరణలో బుధవారం పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం నాయకులు చిలమత్తూరి వెంకటేష్, పాగుతోట వెంకటేష్, గాజుల రమేష్, సురేష్, బిజెపి నరసింహులు, తదితరుల నేతృత్వంలో జరిపిన వేలంపాటలో డిజె మునిస్వామి మొదటి టికెట్‌ను 20 వేలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా థియేటర్ నిర్వాహకులు వెంకటేష్ బాబు మొదటి టికెట్‌ను అందజేయగా తోటి అభిమానులు మునిస్వామికి పూలమాలలు వేసి అభినందించారు.



వేలం పాట దారునికి టికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

## ఇంటెన్సీవ్ ప్రోగ్రామ్ ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం టౌన్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు అందరూ కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ ప్రోగ్రాంను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కోరారు. బుధవారం హిందూపురం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులు అధికారులతో ఓటర్ జాబితా పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పొలిటికల్ పార్టీలు ప్రతి ఒక్కరు పోలింగ్ స్టేషన్ కు బూతు లెవల్ ఏజెంట్లు నియమించుకోవాలని, అక్టోబర్ నెలలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ మొదలు కాబోతున్నది దీనికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండి సహకరించాలని కోరారు. బూతు లెవల్ అధికారులు వారి పరిధిలోని ప్రతి ఒక్క ఇంటిని విజిట్ చేసి ఓటర్ లిస్ట్ రెడీ చేయాలని తెలిపారు. బూతు లెవల్ అధికారితోపాటు ఏజెంట్లు కూడా తప్పనిసరిగా విచారణలో పాల్గొనాలని తెలిపారు.

## ఎంపీడీవోకు ఘనంగా వీడ్కోలు

హిందూపురం టౌన్ సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



ఎంపీడీవోను సన్మానిస్తున్న సిబ్బంది

హిందూపురం ఎంపీడీవో గా విధులు నిర్వహిస్తున్న సరస్వతి ఇటీవల పదోన్నతితో ఇక్కడి నుంచి బదిలీపై వెళుతుండడంతో బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హిందూపురం మండలంలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు కేంచరాయప్ప, గంగాధర్, నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

కళ్యాణదుర్గం టౌన్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త




కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హర్షలత

కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్ వి జి ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథక దినోత్సవాన్ని ప్రిన్సిపల్ హర్షలత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆసియా సాధన కొరకు 1969 సెప్టెంబర్ 24న ఎన్ ఎస్ ఎస్ దేశవ్యాప్తంగా ఏర్పాటయిందన్నారు. చదువుతూనే సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఎన్ఎస్ఎస్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులకు సమాజ సేవ , సామాజిక బాధ్యత ,వ్యక్తిత్వాన్ని పెంపొందించడం ఈ పథకం యొక్క లక్ష్యం అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీధర్, అకాడమీ కోఆర్డినేటర్ సూర్య నాగిరెడ్డి, విమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జోష్ణ, అధ్యాపకులు శ్యాం ప్రసాద్, చాముండేశ్వరి, సౌకతలి ,రాధాకృష్ణ బాబు, కలిముల్లా, తిమ్మరాజు, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ

కంబదూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కోకా ముత్యాలమ్మ

కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామంలో బస్ షెల్టర్ నిర్మాణానికి బుధవారం సర్పంచ్ కోకా ముత్యాలమ్మ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సహకారంతో బస్సు షెల్టర్ నిర్మాణం చేపడతామని తెలియజేశారు. ఇప్పటికే పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## పసిబిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం- సిడిపిఓ

కనేకల్లు సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్

పోషణ మాసోత్సవాల సందర్భంగా కనేకల్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ నాగమణి ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ నాగమణి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, మరియు అనుబంధ పోషకాహారం పై అవగాహన కల్పించారు. బాలల ఆరోగ్యం, ఎదుగుదలలో తల్లిపాల ప్రాముఖ్యత ఎంతో ఉంది, శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి, తల్లిపాల వలన శిశువుకు పూర్తి పోషణ, లభించడంతోపాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తల్లి శిశువు మధ్య అనుబంధం బలపడుతుంది ఆరు నెలలు వయసు వచ్చిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వడం అవసరం , అన్నం, పప్పు, కూరగాయలు, పండ్ల రసాలు, గుడ్డు వంటి పదార్థాలు శుభ్రంగా పోషక విలువలతో తయారుచేసి చిన్న పరిమాణంలో మొదలుపెట్టి క్రమంగా పెంచాలి, అలాగే అంగన్వాడీకేంద్రంలోఇచ్చే బాలామృతమునుకూడా తినిపించాలి అన్నారు. కావున ప్రతి తల్లి తమ పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం, ఆ తరువాత సరైన సమయానికి అనుబంధ పోషకాహారం అందించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఎదిగి సమాజ అభివృద్ధికి తోడ్పడగలరని తెలిపారు .ఈ కార్యక్రమంలో కనేకల్ సెక్టార్ సూపర్వైజర్స్ ఈశ్వరమ్మ,గీత, శాంతమ్మ , తిరుపాల్ భాయ్ స్థానిక మహిళలు ఏఎన్ఎం సచివాలయ సిబ్బంది కమ్యూనిటీ, అంగన్వాడి వర్కర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గుత్తి ఆర్ఎస్‌లో అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ

**గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని, గుత్తి ఆర్ఎస్ రైల్వే ఇన్స్టిట్యూట్ క్రీడా మైదానంలో గురువారం నుండి అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. ఈ మేరకు గౌతమపురి ఫుట్‌బాల్ అసోసియేషన్ మరియు ఆర్డీటి, రైల్వే ఇన్స్టిట్యూట్ సంయుక్తంగా దివంగత క్రీడాకారులు ప్రేమ్ మరియు సూరి జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. బుధవారం క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. రాష్ట్రం నుండే కాక కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుండి జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే పిఏ వీరయ్య



స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పిఏ వీరయ్య

లేపాక్షి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షిలో బుధవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పిఏ వీరయ్య స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత లేపాక్షిలోని పలువురు ఇళ్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్యే పిఏ వీరయ్య స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్మార్ట్ కార్డుల వల్ల డీలర్‌కు రేషన్ పంపిణీ చేసేందుకు సులభతరం అవుతుందన్నారు. మండల వ్యాప్తంగా 14,185 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారుల ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది రేషన్ కార్డులను పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ అభిలాష్, బిజెపి కన్వీనర్ నరసింహమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు బాలాజీ, మండల సమైఖ్య అధ్యక్షురాలు అరుణ,టిడిపి సీనియర్ నాయకుడు సూర్యప్రకాష్, ఈటిగ రమేష్, షేక్షావలి, డైరీ శ్రీరామప్ప, బ్యాంకు నాగరాజు, అనిల్‌కుమార్, ఎన్.బి.కె మూర్తి, అంగడి అంజి, హోటల్ బసవరాజు, మూర్తి, డీలర్లు షికూర్, చంద్రమౌళి, రత్నమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## చికెన్ షాపును మూసి వేయించండి - ఎమ్మెల్యే పిఏకు స్థానికుల వినతి

లేపాక్షి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



ఎమ్మెల్యే పిఏతో మాట్లాడుతున్న స్థానికులు

మండల కేంద్రమైన లేపాక్షిలోని చర్చి రోడ్డులో వున్న చికెన్ షాపును వెంటనే మూసి వేయించాలని స్థానికులు ఎమ్మెల్యే పిఏ వీరయ్య, తహశీల్దార్ సౌజన్య లక్ష్మికి విన్నవించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ చికెన్‌షాపు వల్ల దుర్వాసన వస్తోందన్నారు. రాత్రి సమయాల్లో భరించలేని వాసనవస్తోందని తెలిపారు. గతంలో చికెన్‌షాప్‌కు వెనకాల ఆర్ఒ ప్లాంట్ ఒకటి వుండేదన్నారు. ఆ ప్లాంట్‌ను పునః ప్రారంభించాలని చికెన్ షాపును పూర్తిగా మూసివేయాలని స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన పి ఏ వీరయ్య ఆ షాపు తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గేట్స్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఎంపిక కార్యక్రమం

గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త




గేట్స్‌లో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 భారత ప్రభుత్వం ప్రారంభించిన దేశంలోనే అతిపెద్ద హ్యాకథాన్, దీని ప్రధాన ఉద్దేశం నేడు మానవాళి ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాలకు సంబంధించిన ఒక అతి పెద్ద వేదిక. ఇందులో ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలు పునరుత్పాదక శక్తి, అగ్రికల్చర్, స్మార్ట్ వెహికల్స్, క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీలకు సంబంధించినది వాటిలో పరిష్కారాలు చూపాలని భారత ప్రభుత్వ కోరింది. కళాశాలల విద్యార్థుల ఆలోచనలను ఈ నెల 30వ తేదీ లోపు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం వారు విద్యార్థుల ఎంపిక కార్యక్రమం నిర్వహించి 2 టీమ్‌లను స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె పద్మావతి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శోభామంత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఒ ఇంతియాజ్‌బాష, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన

చిలమత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గ్రామీణ బాలికల ఎదుగుదలకు, ఆరోగ్యకరమైన జీవన విధానానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి లైఫ్ స్కిల్స్ శిక్షణలు దోహద పడతాయని వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోడూరు బిసి కాలనీ, ఎస్‌సి కాలనీ, నల్లరాళ్లపల్లి, తుమ్మలకుంట, వడ్డిపల్లి గ్రామాలతో పాటు చిలమత్తూరు ఎస్‌సి కాలనీ, కెజిబివి కళాశాలలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక ఆరోగ్యం, పోషణ, ఆహార ప్రణాళిక, శారీరక ఆరోగ్యం, భద్రత, భవిష్యత్ ప్రణాళిక, డిజిటల్ లిటరసీ వంటి అంశాలపై వివరించారు. బాలికలు తమ నిర్ణయాలు తాము తీసుకునే ధైర్యం కలిగేలా చేయడమే లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

## జిల్లాలో 5.46 లక్షల ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి

-నిర్దేశిత గడువులోగా సిబ్బంది ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీను పూర్తి చేయాలి-సీసీఆర్‌సీ కార్డులున్న కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సాయం రూ.20వేలు-'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ



చిన్నముష్టూరు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

జిల్లాలో ఇప్పటివరకు 5.46 లక్షల ఎక రాల్లో ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి అయిందని జిల్లా వ్యవసాయాధికారి యు.ఉమామహే శ్వరమ్మ తెలిపా రు. ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో బుధవారం జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మోపిడి గ్రామంలో జరుగు తున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఉరవకొండ మండలంలో 22వేల ఎకరాల్లో ఈ-క్రాప్ బుకింగ్ జరిగిందని మిగిలిన భూమిలో సాగైన పంటల ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. పంటల బీమా, పంటనష్ట పరిహారం, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఈ-క్రాప్ బుకింగ్ కీలకమన్నారు. చిన్నముష్టూరులో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో జిల్లావ్యవసాయాధికారి యు.ఉమామహేశ్వరమ్మ రైతులనుద్దే శించి మాట్లాడుతూ పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ, రాయితీ యంత్రపరికరాలుగూర్చి వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కంది పంటను పరిశీలించి చీడపీడలు, తెగుళ్ళ నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కందిలో అక్కడక్కడా వైరస్ తెగులు సోకిందని దాని నివారణకు వేప నూనె లేదా వేప గింజల కషాయాన్ని లేదా నిమాస్త్రాన్ని 2ఎంఎల్ ఒక లీటరుకు చొప్పున 150 లీటర్లను ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. పూతలో వచ్చే మారుకా మచ్చల పురుగు, సెనగపప్పు పచ్చపురుగు నివారణకుగాను క్లోరోనిట్రనిల్రోల్ అనే మందు 60 ఎంఎల్‌ను 150లీటర్ల నీటిలోకలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. కౌలురైతులు సీసీఆర్‌సీకార్డులు పొందాలని కార్డులున్న రైతులకు అన్నదాత సుఖీభవ పథకంకింద ఏడాదికి20వేలరూపాయలు సాయం అందుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉరవకొండఏడీఏ ఎస్.సత్యనారాయణ, ఏవో బి.రామకృష్ణుడు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎసిటి ఫైబర్ నెట్ సేవలను సద్వినియోగం చేసుకోండి - తహశీల్దార్ రమాదేవి

గుంతకల్లు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తహశీల్దార్ రమాదేవి

ఎసిటి ఫైబర్ నెట్ సేవలను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రమాదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో ఫైబర్ నెట్ సేవలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ యాక్ట్ డిజిటల్ సేవలు 1998 లో ప్రారంభమై విలువలతో కూడిన ప్రయాణం చేస్తుండడం అభినందనీయమన్నారు. మెట్రోపాలిటీ నగరాలకే పరిమితం కాకుండా గుంతకల్లుకు కూడా ఇంటర్నెట్ సేవలు తీసుకురావడం శుభపరిణామన్నారు. భవిష్యత్తులో మరిన్ని నగరాలలో ఎసిటి సేవలు విస్తరించాలని ఆమె ఆకాంక్షించారు. అంతకుముందు వీడియో ఆపరేషన్ హెడ్ సుబ్బారావు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో తిరుపతి తరువాత యాక్ట్ సేవలను గుంతకల్లుకు విస్తరించడం జరిగిందన్నారు. ఇతర ఇంటర్నెట్ సంస్థలతో పోటీ పడుతూ హై స్పీడ్ ఇవ్వడం, నమ్మకమైన సంస్థగా ఎసిటి నిలిచిందన్నారు. ఎసిటి సంస్థ దేశంలోనే 3వ స్థానంలో వుండడం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు సుఖేష్, ప్రసాద్‌రెడ్డి, గుంతకల్లు డిస్ట్రిబ్యూటర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## గుత్తి మున్సిపాలిటీలో నీటి సరఫరాను తనిఖీ చేసిన ఎస్ఇ



పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రామ్మోహన్‌రెడ్డి తనిఖీ చేస్తున్న దృశ్యం

గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

గుత్తి మున్సిపాలిటీలో ప్రజలకు జరుగుతున్న నీటి సరఫరా వ్యవస్థను బుధవారం మున్సిపల్‌శాఖ పబ్లిక్‌అండ్‌హెల్త్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్పాట్ డెలివరీ ట్యాంకులు, ఆర్‌ఓప్లాంట్లు, నీటిట్యాంకులను పరిశీలించారు. నీటినాణ్యతను నిర్ధారించే వ్యవస్థను తనిఖీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలకు సేవాభావంతో సిబ్బంది విధులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియా, డిఈ హేమచంద్ర, ఏఈ గోవిందప్ప, కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాముల బెడద..!

-ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది -శిథిలమైన భవనంలోకి నిత్యం పాములు వస్తుండటంతో భయాందోళనలు -నూతన పీహెచ్‌సీ భవన సముదాయం నిర్మించినా ప్రారంభానికి నోచుకొని దైన్యం







ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలోని శిథిలమైన పీహెచ్‌సీ భవన సముదాయం, నూతనంగా నిర్మాణం పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ భవన సముదాయం, పీహెచ్‌సీలోకి ప్రవేశించి పామును చంపిన దృశ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవలి కాలంలో పాముల బెడద అధికమైంది, పీహెచ్‌సీ భవనాలు శిథిలం కావడంతో ప్రతిరోజూ పాములు పీహెచ్‌సీలోకి ప్రవేశిస్తున్నాయని దీంతో ప్రాణాలు అరచేత పెట్టుకొని విధులు నిర్వహించాల్సి వస్తోందని వైద్యులు, సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పీహెచ్‌సీకి అడుగు పెట్టాలంటేనే భయపడాల్సి పరిస్థితులు నెలకొన్నాయని పాములు ఎప్పుడు ఏవైపు నుండి వస్తాయో తెలియక బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహించాల్సి వస్తోందని చెబుతున్నారు. గడిచిన వారం రోజుల్లో పీహెచ్‌సీలోకి తాచు పాములు, కట్లెల పురగులు, ఇరత్రా పెద్ద పాములు నాలుగైదు రాగా అప్రమత్తంగా ఉండటంచేత వాటిని పసిగట్టి చంపగలిగాయని లేకుంటే వాటి కాటుకు తమతోపాటు వైద్యం కోసం వచ్చేవారు కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేదని చెబుతున్నారు. శిథిలమైన పీహెచ్‌సీ భవనాల స్థానంలో విశాలమైన ప్రదేశంలో కోట్ల రూపాయలు వ్యయం చేసి పీహెచ్‌సీ నూతన భవన సముదాయం నిర్మాణం పూర్తిఅయి సంవత్సరాలు గడుస్తున్నా దాన్ని ప్రారంభించడానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు, రోగుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. శిథిలమైన భవనాల్లో పాముల కాటుకు ఎవరైనా ప్రాణాలు కోల్పోతేగాని అధికారుల్లో చలనం రాదేమోనని మండిపడుతున్నారు. పీహెచ్‌సీను నూతన భవనాల్లోకి మార్చడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

# ఎమ్మెల్యేకి క్షమాపణ చెప్పు.. లేకుంటే ఛాంబర్‌ను ముట్టడిస్తాం

-మేయర్‌కు టిడిపి మైనార్టీ నాయకులు హెచ్చరిక




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మైనార్టీ నాయకులు

అనంతపురం సెప్టెంబరు 24 ప్రభాతవార్త

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై విమర్శలు చేసిన మేయర్ మహమ్మద్ వసీం క్షమాపణ చెపాలని లేకుంటే ఛాంబర్‌ను ముట్టడిస్తామని టిడిపి మైనార్టీ నాయకులు హెచ్చరించారు. బుధవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సైపుద్దీన్, కార్పొరేటర్ జనబలం బాబా తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేయర్‌తో పాటు కార్పొరేటర్లు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, నీవు, నీ అంకుల్ వెంకటరామిరెడ్డి సహకారంతో దొడ్డదారిలో పదవిని దక్కించుకున్న విషయం నగర ప్రజలకు తెలిసిందేనన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చేస్తున్న అభివృద్ధి పనులను చూసి జీర్ణించుకోలేక తప్పుడు అరోపణలు చేయడం సరికాదని వారు హెచ్చరించారు. కమిషనర్‌ను బెదిరించడానికి మీ ఇంట్లో పనిమనిషి కాదన్నారు. రూ.వెయ్యికోట్లు నిధులు కేంద్రం నుంచి తెచ్చి అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న మీరు అప్పట్లో తెలుగుదేశం పార్టీ అధికార హయాంలో తీసుకొచ్చిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకుని మంచిగా వుండాలని అసత్య అరోపణలు, విమర్శలు చేస్తే మైనార్టీలు సహించరని వారు హెచ్చరించారు.

# వైద్య కళాశాలల ప్రవేటీకరణను అడ్డుకుంటాం

-జెబిపి ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ ఎదుట నిరసన



జెబిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు

అనంతపురం సెప్టెంబరు 24 ప్రభాతవార్త

వైద్య కళాశాలల ప్రవేటీకరణను అడ్డుకుంటామని జెబిపి జిల్లా అధ్యక్షుడు రామప్పనాయక్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించాడు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జెబిపి) ఆధ్వర్యంలో ఆయన ప్రవేటీకరణకు నిరసనగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకుని ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామప్ప నాయక్ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రవేటీకరణకు అప్పగిస్తే సామాన్య, మధ్యతరగతి, హరిజన, గిరిజన కుటుంబాలకు వైద్య విద్య అవకాశాలు కనుమరుగౌతాయన్నాడు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ప్రవేటీకరణ విధానానికి స్వస్తి చెప్పాలని లేకుంటే భవిష్యత్‌లో అన్ని వర్గాల ప్రజలను, సంఘాలను కలుపుకుని ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించాడు. ఈ కార్యక్రమంలో జెబిపి అర్బన్ ఇన్‌చార్జ కొడవండ్ల నరేష్, బహుజన, యువజన వ్యవస్థాపక అధ్యక్షుడు చర్లహరి చంద్ర, అర్బన్ మండల అధ్యక్షుడు కె.వెంకటేష్, ఉపాధ్యక్షుడు సాకే వన్నూరుస్వామి, రైతు కూలీ సంఘం కార్యదర్శి లూకా కృష్ణ, పిడిఎస్ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, భారతీయ భీమ్‌సేన అధ్యక్షుడు జైభీమ్ రామాంజి, రాష్ట్ర అధ్యక్షుడు సాకే ఓబులేసు, బుడగజంగాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ఇపుడే గుర్తొచ్చిందా వసీం..

- ఎమ్మెల్యే పెత్తనం చేయాలంటే మున్సిపల్ గేట్ కూడా తాకలేవ్...

-పలువురు కార్పొరేషన్ డైరెక్టర్లు హెచ్చరిక




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ల డైరెక్టర్లు

అనంతపురం సెప్టెంబరు 24 ప్రభాతవార్త

నాలుగేళ్లకు పైగా మేయర్‌గా కొనసాగుతున్న వసీం ప్రొటోకాల్ ఇపుడే గుర్తొచ్చిందా .. ఎమ్మెల్యే పెత్తనం చేయాలంటే కనీసం నగరపాలక సంస్థ గేట్‌ను కూడా తాకలేవ్..అంటూ పలువురు కార్పొరేషన్ల డైరెక్టర్లు హెచ్చరించారు. బుధవారం స్థానిక అర్బన్ టిడిపి కార్యాలయంలో కార్పొరేషన్ల డైరెక్టర్లు బొమ్మినేని శివ, పిఎల్‌ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న తదితరులు విలేకరుల సమావేశం నిర్వహించి నగర మేయర్ మహమ్మద్ వసీంపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూంటే అభినందించాల్సింది పోయి విషం చిమ్ముతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవంగా ప్రొటోకాల్ ఇచ్చిందే మా తెలుగుదేశం పార్టీనేనని, టిడిపికి చెందిన ఖాజా అనే వ్యక్తి లేకుంటే నువ్వు ఎక్కడ వుండేవాడివో తెలుసుకో, కనీసం ఏనాడైనా పార్టీ జెండా పట్టుకుని తిరిగివా, గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటికి వెళ్లి సంతకాలు పెట్టే వరకే పరిమితమైనావని విమర్శించారు. దగ్గుపాటి నీలాగే దొడ్డిదారిలో పదవిలోకి రాలేదని, 40 రోజులు ముందు వచ్చి 23వేల ఓట్ల మెజారిటీతో గెలుపొంది ఎమ్మెల్యే అయ్యాడన్నారు. ఇప్పటికైనా ఎవరు, ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని, అనవసరంగా మాట్లాడితే నీతో పాటు నీ కార్పొరేటర్లు కూడా గేటు తాకలేరని వారు హెచ్చరించారు.

# సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కండి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



మొక్కలు నాటి నీటిని పోస్తున్న దృశ్యం

విద్యార్థి దశ నుంచే సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని యస్వీ డిగ్రీ, పిజి కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక యస్వి డిగ్రీ, పిజి కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక స్పృహ అవసరం అన్నారు. గాంధీ ఆశయ సాధన కోసం ఏర్పడిన ఎన్ఎస్ఎస్ ప్రపంచంలో అత్యధిక వాలంటీర్లు కల్గిన సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ.వి.ప్రసాద్ మాట్లాడుతూ.. సామాజిక భావన రేకెత్తించేలా ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలిసిన గ్రామాల్లో సామాజిక అలవాట్లు, మనుషుల నడవడిక కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలనే భావన కలుగుతుందన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏవో ఎ.శ్రీనాథ్. ఎన్ఎస్ఎస్ పిఓలు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి వాలంటీర్లు కృతిక, షర్మిల, మల్లీశ్వరి, ప్రవీణ్, రోహిత్, ప్రకాష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# టీసీలు ఇవ్వని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

డిగ్రీ, బిటెక్, ఎంబీఏ, ఎంసిఏ, బీఈడీ, డిప్లమా వంటి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు టీసీలు, మార్క్స్ మెమోస్, ఇతర పత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు అమర్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. పాత్రికేయుల సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడుతూ.. చదువులు పూర్తి చేసిన విద్యార్థులు టీసీలు ఇతర పత్రాలు కావాలని అడగగా ప్రభుత్వం నుంచి ఫీజు బకాయిలు విడుదల కాలేదని మీ సొంత డబ్బులు కట్టి మీకు కావాల్సిన పత్రాలు తీసుకెళ్లాలని వెళ్లాలని చెబుతుండటం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థులు విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీమార్సైంట్, స్కాలర్ షిఫ్ లను విడుదల చేసి విద్యార్థులకు టిసి పత్రాలు ఇప్పించాలని వారి భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు.

# కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన సమాచార హక్కు పరిరక్షణ కమిటీ నేతలు



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి వినతిపత్రం అందజేస్తున్న సమాచార హక్కు పరిరక్షణ కమిటీ నేతలు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ.ఆనంద్‌న సమాచార హక్కు పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు హోన్నూరప్ప, ఉపాధ్యక్షుడు కోటేగంటి నబి రసూల్, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. అనంతపురం జిల్లాలో సమాచార హక్కు చట్టంపైన పనిచేస్తున్న సంఘం ఉండడం చాలా ఆనందంగా ఉందని, నెల్లూరు జిల్లాలో ఎటువంటి సంఘాలు లేవు అని కలెక్టర్ తెలియజేశారు. కేరళ రాష్ట్రం అందులోనూ అభివృద్ధి చెందిన మల్లాపురం జిల్లా నుండి మా జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ అంకె రామలింగమయ్య, బి అనంత కుమారి, హుస్సేన్ పీరా, జాయింట్ సెక్రెటరీ మనోజ్ కుమార్, కల్చరల్ సెక్రెటరీ రషీద్, సింగనమల మండలం కన్వీనర్ రాజ కుల్లాయప్ప, కళ్యాణదుర్గం కన్వీనర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై బృహత్తర కార్యక్రమాలను చేపట్టే ఏకైక సంస్థ ఆర్డీటీ

- ఆర్డీటీ కోసం మేము సైతం అంటూ మాంచో ఫెర్రర్‌ను కలిసిన పూర్వవిద్యార్థులు



మాంచో ఫెర్రర్‌ను కలిసిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

పామిడి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

నిరంతరం ప్రజాసేవలో నిమగ్నమై బృహత్తర కార్యక్రమాలను చేపట్టే ఏకైక సంస్థ ఆర్డీటీ అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, ఎల్లార్తి చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్, సుబ్బరాయుడు, జెన్నే వన్నూర్ కొనియాడారు. ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను బుధవారం కలిసిన వారంతా కేంద్ర ప్రభుత్వం ఆస్థకు ఎఫ్‌సిఆర్ఏను రెన్యువల్ చేయించటంలో మా వంతు పోరాటం చేస్తూ ఆర్డీటీ కోసం మేము సైతం అంటూ ముందుకు సాగుతామని తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కరువు బారిన పడిన ఆనంతపురం జిల్లాను ఆదుకోవటానికి విన్సెంట్ ఫెర్రర్ 1969 ఆర్డీటీ అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సేవే మార్గం సమానత్వమే మతంగా తన సేవా కార్యక్రమాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపి చిరస్మరణీయుడిగా నిలిచిపోయాడని తెలిపారు. ఆర్డీటీ సంస్థ ద్వార అక్షరాస్యత, శాశ్విత గృహ నిర్మాణాలు, పాఠశాలలు, క్రీడలు, హాస్పిటల్స్, వాటర్‌షెడ్ల నిర్మాణాలను చేపడుతూ ప్రభుత్వాలతో సమాంతరంగా సేవలను అందించిన మహానుభావుడు విన్సెంట్ ఫెర్రర్ అని అయన మరణించిన తదనంతరం కుటుంబ సభ్యులు అన్నే ఫెర్రర్, మాంచో ఫెర్రర్, విశాల ఫెర్రర్‌లు సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలియజేశారు. ఈక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్ఏను నిలిపివేయటం కారణంగా ఆర్డీటీ సేవలు ఎక్కడికక్కడ స్తంభించిపోయి నిరుపేదల ప్రజలకు అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అందువల్ల వెంటనే ఎఫ్‌సిఆర్ఏను పునరుద్దరించి సంస్థ సేవలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# జాతీయ సేవాభావం ఎన్ఎస్ఎస్ లక్ష్యం

- ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అక్కులన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పిఓ అక్కులన్న

పామిడి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

పర్యావరణ పరిశుభ్రత జాతీయ సేవాభావం ఎన్ఎస్ఎస్ లక్ష్యం అని ప్రోగ్రాం ఆఫీసర్ అక్కులన్న పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు బుధవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అక్కులన్న మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృక్పదాన్ని అలవర్చుకుని నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటూ సమాజాభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతలను విస్మరించకుండా బాధ్యతాయుతంగా ముందుకు సాగాలన్నారు. హిస్టరీ అధ్యాపకులు నారాయణరెడ్డి మాట్లాడుతూ మనిషిని మనిషిగా గుర్తించి ఆపదలో ఆదుకున్నప్పుడే నిజమైన సేవకుడిగా గుర్తింపును సాధిస్తామని తెలిపారు. సేవా దృక్పదంతో ముందుకెళ్తే నిరంతరం దేవుణి కృప మనపై ఉంటుందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూనే వారిలో సేవా గుణాన్ని పెంపొందిస్తున్నామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అనంతకుమారి, పిడి రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరులో వైద్య శిబిరం ఏర్పాటు

- డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మనోజ్.

అనంతపురం రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం కందుకూరుగ్రామపంచాయతీలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించి, ఈ కార్యక్రమంలో సచివాలయాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామంలోని బాలింతలు గర్భవతులు, ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు అందించడం జరిగిందని, ఈ వైద్య శిబిరంలో గ్రామ ప్రజలతోపాటు క్లాత్ మిత్రులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, మండల డాక్టర్ మనోజ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్స్, పంచాయతీ కార్మికులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీకి అమ్మవారి దీక్షా దుస్తుల్లో హాజరైన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



నీలం రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

రాప్తాడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

నవరాత్రుల సదర్భంగా రోజుకో రంగు దుస్తుల్లో అసెంబ్లీకి వెళ్లాలని నిర్ణయం తీసుకోగా బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారం సందర్భంగా నీలం రంగు దుస్తులు ధరించిన మహిళా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. అసెంబ్లీలో హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణని తోటి మహిళా ప్రజాప్రతినిధులతో కలసిన రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత ఆప్యాయంగా పలకరించారు.

# వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ చేస్తున్న నాయకులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

నగరంలోని నడిమివంక వద్ద వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టకు వడ్డే ఓబన్న జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తొలి స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న విగ్రహాన్ని పార్టీలకు అతీతంగా నగరంలోనీ నడిమివంక పీటీసీ వద్ద రెండు నెలల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు. వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు జిల్లా వ్యాప్తంగా వడ్డర్లు తరలివచ్చి జయప్రదం చేస్తూ వడ్డెరలంతా ఏకతాటిపై ఉన్నారన్న విషయాన్ని తెలియజేద్దామన్నారు. రాజకీయంగా అవకాశం కల్పించే పార్టీలకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో వడ్డెర్లకు మేయర్ పదవికి అవకాశం కల్పించాలని రాజకీయ పార్టీలకు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లెల జయరాం, వడ్డే గోపాలకృష్ణ, వీకే గంగన్న, దలవాయి పెద్ద మారెప్ప, దలవాయి వెంకటనారాయణ, కుంచపు వడ్డే వెంకటేష్, మల్లెల వేణుగోపాల్, కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, రామచంద్ర, కుంచపు శంకర్, చియ్యేడు రామకృష్ణ, నెట్టికల్లు నారాయణ, చల్లా రామాంజనేయులు, లోక్ నాథ్, నాగార్జున, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# అనాధ శవానికి అంత్యక్రియలు

అనంతపురం కల్చరల్,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మంగళవారం రోజున అనంతపురంలో రైల్వే స్టేషన్ రోడ్‌లో ఒక అనాద వ్యక్తి చని పోయాడు ఈ విషయం వన్ టౌన్ పోలీస్ వారి దృష్టికి వెళ్లగా వారు ప్రభుత్వ ఆసుపత్రి తీసు కెళ్లడం జరిగినది. తీసు కెళ్లిన తర్వాత అతను ఒక ముస్లిం అని తెలిసి పోలీసులు గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ ప్రెసిడెంట్ హాజి జిలాన్ కి ఫోన్ చేసి తెలియజేశారు. హాజి జిలాన్ ఈద్గా ముతవల్లి షకీల్‌కి ఫోన్ చేయగా అంత్యక్రియలకు ఏ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయడం జరిగినది. ఈ అంత్యక్రియలలో గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ సభ్యులు హారున్ రషీద్ ఖాజీ సాబ్, హ్యూమన్ రైట్స్ హబీబ్, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు వలి ,ఇర్ఫాన్ ఇస్మాయిల్, ఫక్రు,మున్నా,వన్ టౌన్ పోలీస్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపురం, చోళసముద్రంలో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కూడేరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

మండల పరిధిలోని చోలసముద్రం, తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం మండల వ్యవసాయ అధికారి శుభకర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు యూరియా వినియోగం, మట్టి నమూనా పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా రిసోర్స్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పద్మలత రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అధికంగా యూరియాను వాడటం వలన మట్టి సారవంతత క్షీణించి, భవిష్యత్ పంటల ఉత్పాదకత దెబ్బతింటుందనివివరించారు. చోలసముద్రం గ్రామంలో 12.6 మెట్రిక్ టన్నుల యూరియాను పి.నారాయణపురం గ్రామంలో 6.3 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారులు రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జీలు ఆర్చనా, జయప్రకాశ్, రాజ్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ మురళి, చోలసముద్రం వడ్డే రాజు, గ్రామ సర్పంచ్ వడ్డే రమాదేవి, రైతులు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే, కూడేరు మండలంలో అన్ని రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జీలతో కలిసి పంట భీమా సంబంధిత క్రాప్ కట్టింగ్ ఎక్స్‌పెరిమెంట్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ ఆశ పాల్గొని, శాస్త్రీయ పద్ధతుల్లో క్రాప్ కట్టింగ్ ఎక్స్‌పెరిమెంట్లు నిర్వహించడం, డేటా సేకరణ ప్రాముఖ్యత పంట భీమా ప్రయోజనాలపై మార్గదర్శకాలు అందించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు రాప్తాడు మండలానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాప్తాడు మండల ఇంచార్జ్ ధర్మవరపు మురళి టీడీపీ మండల నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు 3,48,290 రూపాయల చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు లబ్ధిదారులు టిడిపి మండల ఇన్చార్జ్ ధర్మవరపు మురళికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెండింగ్ ఇంటి గుత్తలన్నీ వసూలు చేయాలి

పంచాయతీ సిబ్బందికి తెలిపిన డియల్‌పీఓ,గ్రేడ్ I కార్యదర్శి.



ఇంటి గుత్తలు వసూలు వివరాలను అడిగి తెలుసుకుంటున్న డియల్ పిఓ

అనంతపురంరూరల్,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

అనంత రూరల్ మండలం కక్కలపల్లికాలనీపంచాయతీలో పెండింగ్ ఉన్న ఇంటి గుత్తులన్నీవసూలుచేయాలనిపంచాయతీ సిబ్బందికి డి ఎల్ పిఓవిజయ కుమార్, కక్కలపల్లి క్లస్టర్ గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి యు.హిదయాతుల్లా తెలియజేశారు. పంచాయతీలో ఇంకా ఇంటి గుత్తలు ఎంత పెండింగ్ ఉన్నా యని ఇంటి గుత్తలువసూలుచేసేసిబ్బందితో వివరాలను డి యల్ పీఓ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కమీషనర్, పెండింగ్ ఇంటి గుత్తుల వసూల్లో చాలా సీరియస్ గాఉన్నారనిపెండింగ్ ఇంటి గుత్తులన్నీ వసూలు చేయాలని ఆదేశించడం జరిగిందని వారి ఆదేశాల తప్పకుండా మీరంతా పెండింగ్లో ఉన్న ఇంటి గుత్తులన్నీ వసూలు చేయాలని ఇంటి గుత్తలు వసూలు చేయాలన్నారు. గ్రామ ప్రజలందరు ఇంటి గుత్తలు, నీటి పన్ను లు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ప్రజలను కోరారు.

# జిల్లాకు 862.23 మెట్రిక్ టన్నుల యూరియా

ఏడిఏ అల్తాఫ్ అలీ ఖాన్.

అనంతపురంరూరల్,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:



యూరియా స్టాక్ లిస్టును పరిశీలిస్తున్న ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్

జిల్లాలోని అవసరమైన రైతులందరికీ యూరియా అందిస్తామని ఏ డి ఏ అల్తాఫ్ అలీఖాన్,తెలిపారు. బుధవారం జిల్లాకు వచ్చినయూరియాస్టాక్, రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం కోరమండల్ కంపెనీకి చెందిన యూరియా 862.23 టన్నులువచ్చిందని,అందులో మార్క్ ఫెడ్ కు రైతు సేవా కేంద్రాలకు 336 టన్నులు ప్రైవేటు డీలర్లకు, మన గ్రోమోర్ సెంటర్‌లకు 526.23 మెట్రిక్ టన్నులు జాయింట్, కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు పంపిణీచేస్తామన్నారు.

# పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ పై శిక్షణ




శిక్షణ శిక్షణా కార్యక్రమానికి హాజరైన సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు

అనంతపురంరూరల్,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పంచాయతీ అడ్వాన్స్ డ్ ఇండెక్స్ పై బుధవారం అనంతపురం మండల పరిషత్ సమావేశ భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ చందర్ కుమార్,వైస్ ఎంపీపీచియ్యేడు కృష్ణారెడ్డి, ఎంపీడీవో దివాకర్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవోదివాకర్, సర్పంచులకు ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పంచాయతీ అడ్వాన్స్డ్ ఇండెక్స్ గ్రామస్థాయిలో ఎలా తయారు చేసుకోవాలి, ఎలా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి, నమోదు చేసుకున్న వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే అంశాలపై నిశితంగా సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు, సర్పంచులు గార్లదిన్నె కృష్ణయ్య, కట్టప్ప గారి కృష్ణారెడ్డి, సావిత్రి శ్రీనివాసులు, ఆశాబి, సుబ్బిరెడ్డి, శివ శంకర్, ఎంపీటీసీలు గౌస్, మహబూబ్ బీ సాధిక్, పంచాయతీ కార్యదర్శులు బాబా ఫక్రుద్దీన్, మహమ్మద్ రఫీ,మల్లికార్జున,గోవిందరాజులు,పద్మావతి, హైమావతి, చరణ్‌కుమార్,అంగనవాడి సూపర్వైజర్లు,వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సలకం చెరువులో స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్




పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని సలకం చెరువు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో స్వస్థ్‌నారీ సక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానంగా మహిళల్లో పెరుగుతున్న రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి క్యాన్సర్‌లను తొలి దశలోనే గుర్తించడం కోసం వైద్య సిబ్బంది అందుకోసం నిర్వహిస్తున్న పరీక్షలు, తదితర అంశాలను వివరించారు. రక్తపోటు, దయాబెటిస్ గురించి అవగాహన కల్పిస్తూ గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ గంగాధర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది భారతి, దివ్య, అనూష, కౌసర్, మౌనిక, జ్యోతి, రాధ, ఉపతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచు ఆదినారాయణ, వైస్ ఎంపిపి నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

శింగనమల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇటీవల అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ.ఆనంద్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో డివిజినల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు బండారు కుళ్లాయప్ప, ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నర్సంపల్లి లింగమయ్య, రామాంజినేయులు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

# కాత్యాయనిదేవి అలంకారంలో అమ్మవారు

యల్లనూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవ రోజు బుధవారం అమ్మవారు శ్రీకాత్యాయనిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

04ATP13_04ATP13.qxd 24-09-2025 PM 10:46 Page 1



## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పయ్యావుల కేశవ్


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర టిడిపి నేతలు

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ, సాయి పవన్ కుమార్ వివాహ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఇతర టిడిపి నేతలు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బ్రాడీపేట, బైపాస్ రోడ్ ఉన్న కళ్యాణమండపంలో బుధవారం జరిగిన వివాహ వేడుకల్లో స్థానిక నాయకులతో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.

## సోమందేపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ


స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

**సోమిందేపల్లి సెప్టెంబర్ 24 ప్రభాత వార్త**

నియోజకవర్గంలోని పెనుకొండ, సోమందేపల్లి, పరిగి,పోలీస్ స్టేషనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్, పోలీస్ స్టేషన్లోని రిసెప్షన్ కౌంటర్ ,రికార్డుల నిర్వహణ, లాకప్ గదులు పోలీస్ స్టేషన్ పరిసరాలను, పరిశీలించారు ట్రాఫిక్ నివారణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు , ద్విచక్ర వాహనాలు యొక్క కేసు వివరాలను ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీసు స్టేషన్ లకు సంబంధించిన ఫైళ్లను , పలు రిజిస్టర్ లను క్షుణ్ణంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ,సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తూ, లాంగ్ పెండింగ్ లో ఉన్న కేసులు పరిస్థితులను ,రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డయల్ 100,112 కి వచ్చే కాల్స్ కి కాలర్ దగ్గరికి వెళుతున్నారా లేదా అని సిబ్బంది ద్వారా ఆరాతీశారు. స్టేషన్ పరిధిలో నేర , శాంతి భద్రతల గురించి అడిగితెలుసుకోవడంతో పాటు ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగే నేరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిస్సింగ్ కేసులు ఛేదన, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలన్నారు. చోరీలు జరగకుండా రాత్రివేళల్లో గస్తీలు ముమ్మురం చేసి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్ సిబ్బంది యొక్క విధులు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని మహిళలు, బాలికల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ప్రజల్లో పోలీస్ శాఖ పై నమ్మకం పెంచే విధంగా పోలీస్ సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లా ఎస్పీ వెంట పెనుగొండ సిఐ రాఘవన్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా పవన్ సినిమా రిలీజ్ వేడుకలు

### చక్రవర్తి ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీ


ర్యాలీ లో చక్రి తదితరులు


అంబేద్కర్ కు నివాళి దృశ్యం

**హిందూపురం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ఓ జి సినిమా గురువారం విడుదల సందర్భంగా హిందూపురంలో జనసేన మండల అధ్యక్షులు చక్రవర్తి(చక్రి) ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరిగాయి. బుధవారం సాయంకాలం సుగురు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు, జనసేన జెండాలు, సినిమా పోస్టర్లను ఏర్పాటు చేసుకొని పార్టీ సైనికులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బెంగళూరు రోడ్డు మీదుగా అంబేద్కర్ సర్కిల్ కు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి చక్రవర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. సినిమా రిలీజ్ అవుతున్న థియేటర్ వద్దకు చేరుకొని కోలాహలంగా కేరింతలు కొడుతూ, బాణాసంచా పేల్చుతూ డీజే పాటలతో హోరెత్తించారు. తదుపరి థియేటర్ ఆవరణలో జనసేన అసెంబ్లీ ఇంచార్జ్ ఉమేష్, చక్రవర్తి తదితరులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు కిషోర్, శివ, మంజునాథ్, దుర్గ, వెంకటేష్, రఘు, సుధాకర్, యేసు, శివ, విక్కీ, భరత్, ఇందు, అంజి, హరి, మూర్తి, బాలు, ఉదయ్, కళ్యాణ్, నాగేంద్ర, ఫణి, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవుని గా దర్శనమిచ్చిన వచ్చిన అమ్మవారు





శివకోటి ఆలయంలో,కాశీవిశ్వేశ్వర ఆలయంలో,శంకర మఠంలో,శివ బాలయోగి ఆశ్రమంలో

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**

నవరాత్రి సందర్భంగా బుధవారం అనంతపురం నగరంలోని శృంగేరి శంకర శారద మఠంలో ప్రత్యేక పూజలునిర్వహించారు. అనంతేశ్వరి అనంతేశ్వర స్వామి వారికి పంచామృత సహిత ఏకవార రుద్రాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి తదుపరి తీర్థప్రసాదవినియోగం సాయంత్రం అనంతేశ్వరి దేవి అన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీశృంగేరి శంకరశారదమఠంనందు ఉదయం విశేష పూజలు హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారినకి ఊంజలసేవ, రథోత్సవము నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు రామకృష్ణ, మార్తాండ, బ్రాంచ్ హెడ్ సత్యప్రసాద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు. హెచ్ఎల్‌సి కాలనీలో శ్రీ చాముండేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు.. శివకోటిలోని శ్రీ లలితా కామేశ్వరి అమ్మవారు వైష్ణవి దేవిగా దర్శనమిచ్చారు.

## రాష్ట్రపతిని కలిసిన జాతీయ అవార్డు గ్రహిత జూజారే నాగరాజు...!


రాష్ట్రపతి ద్రౌపదిముర్మూను కలిసిన జాతీయ అవార్డుగ్రహిత జూజారే నాగరాజు, తదితరులు

**ధర్మవరం, సెప్టెంబరు 24,ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత డిజైనర్, జాతీయ అవార్డు గ్రహిత జూజారే నాగరాజు రాష్ట్రపతి ద్రౌపది ముర్మూను బుధవారం రాష్ట్రపతి భవన్లో కలిశారు: జాతీయ చేనేత దినోత్సవం రోజు ధర్మవరం కు చెందిన జూజారేనాగరాజుకు డిల్లీలో కేంద్రమంత్రులు ద్వారా జాతీయ అవార్డును అందుకున్న విషయం తెలిసిందే. అయితే జాతీయ అవార్డు ప్రధానం రోజు రాష పతి హాజరు కాలేకపోవడం జరిగిందని, అయితే ప్రదానినరేంద్రమోడీ ఆదేశాల మేరకు అవార్డులు అందుకున్న వారికి రాష్ట్రపతికలిసే అవకాశం కల్పించారని జాతీయ అవార్డు గ్రహీత తెలిపారు. ఇందులో బాగంగా బుధవారం దేశ వ్యాప్తంగా జాతీయ అవార్డులు అందుకున్న 24 మందిని రాష్ట్రపతిభవనలోకి విందుకు ఆహ్వానించారు. అనంతరం రాష్ట్రపతిభవన్, అమృత గార్డెన్ యొక్క విశేషాలను గైడ్ ద్వారా విశదీకరించారు.

## మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె వివాహ వేడుకల్లో ఎంపీ అంబికా లక్ష్మినారాయణ


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ, సాయి పవన్ కుమార్ వివాహ వేడుకల్లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బ్రాడీపేట, బైపాస్ రోడ్ ఉన్న కళ్యాణమండపంలో బుధవారం జరిగిన వివాహ వేడుకల్లో స్థానిక నాయకులతో కలిసి ఎంపీ అంబికా పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించాలి

### గ్రీన్ సత్యసాయి జిల్లాగా తీర్చిదిద్దాలి.. బొకేలు వద్దు పూల మొక్కలు ముద్దు. జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్


వృద్ధురాలు వెంకట లక్ష్మమ్మతో కలసి మొక్క నాటుతున్న జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ అధికారుల దృశ్యం.

**కొత్తచెరువు సెప్టెంబరు 24 ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి బాధ్యతగా సంరక్షించి జిల్లాను గ్రీన్ సత్యసాయి జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లాకలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అన్నారు. బుధవారం పుట్టపర్తి రూరల్ కప్పలబండపాలం జానకి రామయ్య కాలనీ నందు జిల్లా నీటియాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కార్యక్రమంలో భాగంగా కోటిమొక్కలు నాటే అంకురార్పణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో విరివిగా మొక్కలు నాటాలని బాధ్యతగా వాటిని సంరక్షించి పెద్ద వృక్షాలు అయ్యేంతవరకు దత్తత చేసుకోవాలని అన్నారు.తొలుత భగవాన్ శ్రీ సత్య సాయి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు.అనంతరం కోటి మొక్కలు నాటే అంకురార్పణ కార్యక్రమానికి తొలుత కలెక్టర్ వృద్ధురాలు అయినా వెంకట లక్ష్మమ్మ ఆధీనంలో ఉన్న భూమిలో మొక్కలు నాటించి ప్రారంభించారు. అలాగే ఈ ప్రాంతానికి వెంకట లక్ష్మమ్మ తోట పేరుతో నామకరణం చేశారు.ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్రీ డీఎఫ్ఓ శ్రీనివాసులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఇంచార్జ్ పిడి శ్రీలక్ష్మి, ఏపీడి జ్యోతి, జడ్పీ డిప్యూటీ సీఈవో జె వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో నటరాజ్, ప్లాంటేషన్ మేనేజర్ వెంకప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవిగా ఎల్లమ్మతల్లి


ఎల్లమ్మతల్లిని అలంకరించిన దృశ్యం

**గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

విజయదశమి వేడుకలను పురస్కరించుకుని దేవి శరన్నవరాత్రుల సందర్భంగా గుత్తి కోటలోని ప్రాచీన రేణుక ఎల్లమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని కంచి కామాక్షిదేవిగా అలంకారం గావించారు. అదేవిధంగా శ్రీషిరిడిసాయి దేవస్థానంలో సాయినాథుడిని వేరుశనగ విత్తనాలతో అలంకరించారు. సేవాఘడ్‌లో వెలసిన జగదాంబ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఆయా ఆలయాలల్లో పెద్దఎత్తున భక్తుల సందడి కాన వచ్చింది.

## రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన జయప్ప


టూరిజం శాఖ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపడుతున్న జయప్ప

**లేపాక్షి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

లేపాక్షికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ఈడిగ జయప్ప బుధవారం విజయవాడలో రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్‌గా పదవీబాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ బాలాజీ సమక్షంలో జయప్ప 12.55 గంటలకు పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర టూరిజం శాఖ అభివృద్ధికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, చైర్మన్ బాలాజీలతో కలిసి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ ఎస్ఈ ఈశ్వరయ్య, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, గోవిందు, డిష్ మంజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన టిడిపి నగర ఉపాధ్యక్షుడు మార్కెట్ మహేష్



**అనంతపురం సెప్టెంబరు 24 ప్రభాతవార్త**

ఇటీవల జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఓ. అనంద్‌ను తెలుగుదేశం పార్టీ నగర ఉపాధ్యక్షుడు మార్కెట్ మహేష్ బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఆదేశాల మేరకు తనతోపాట ఎస్సీసెల్ నగరఅధ్యక్షుడు సాకే వెంకటేష్, ప్రధానకార్యదర్శి చిర్రోళ్లరామాంజినేయులు తదితరులు కలెక్టర్‌ను కలిసి అభినందించినట్లు తెలిపాడు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న టిడిపి మార్కెట్ మహేష్ ←

## సత్యసాయి శత జయంతికి పర్యావరణహితంగా పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

### జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్


శతజయంతి ఉత్సవాలపై అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

**పుట్టపర్తి(కల్చరల్), సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి వేడుకలకు పర్యావరణహితంగా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, జెసీ అభిషేక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, శ్రీ సత్యసాయి ట్రస్టు సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, అధికారులు సమిష్టిగా, సమన్వయంతో రాష్ట్రం గర్వపడేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. రోజువారీ భక్తుల రాకపోకల అంచనాలు వేసి, అవసరమైన వసతులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. భక్తులు రాష్ట్రం, పొరుగు నగరాలు మాత్రమే కాకుండా దేశ, విదేశాల నుండి కూడా వస్తారని, రవాణా, వసతి ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. తాగునీరు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్లు, వీధి దీపాలు, డస్ట్‌బిన్లు, వ్యర్థాల నిర్వహణ, డ్రైనేజ్ వ్యవస్థలు, ఫుడ్ కౌంటర్లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, అదనపు సిబ్బంది నియామకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని మున్సిపాలిటీ, పంచాయతీల సిబ్బందిని షిఫ్ట్‌ల వారీగా 24/7 విధుల్లో ఉంచాలని ఆదేశించారు. బెంగళూరు – పుట్టపర్తి రహదారులు గుంతలు లేకుండా అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా పెనుకొండ – కొత్తచెరువు, బ్రాహ్మణపల్లి – ఏనుములపల్లి మార్గాలను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీకి ఇంటర్నల్ రింగ్ రోడ్ల అభివృద్ధి, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పార్కింగ్ సౌకర్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. భక్తుల రాకపోకలు, ముఖ్య ప్రదేశాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్టమైన పహారా కోసం స్పష్టమైన కార్యాచరణ ఉండాలని చెప్పారు. వాటర్ పాయింట్లు ఏర్పాటు చేసి, సురక్షిత త్రాగునీరు అందించాలన్నారు. ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలన్నారు. అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమలులోకి వస్తుందని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకూడదని, పేపర్ ప్లేట్లు, అరటి ఆకులు, క్లాత్ బ్యాగులు వినియోగంపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్ల పక్కన గ్రీన్, రెడ్ డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని, భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెల్త్ క్యాంపులు, అదనపు ఆర్టీసీ బస్సులు కూడా అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఉత్సవాల భద్రత కోసం సమగ్ర సెక్యూరిటీ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని, అత్యవసర వాహనాలు, సీసీ కెమెరాలు, బాడీ ఓన్ కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమ్యూనికేషన్ కోసం రిపీటర్ స్టేషన్, పార్కింగ్ ప్రాంతాల్లో కెమెరాలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ నుండి క్విక్ రియాక్షన్ టీములు పర్యవేక్షణ చేస్తాయని వివరించారు. అంతకుముందుగా జెసీ అభిషేక్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శత జయంతి వేడుకల ఏర్పాట్లపై వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో సువర్ణ, ట్రస్టు సభ్యులు చలం, డాక్టర్ నారాయణ్ కే. ప్రభు, రామేశ్వర్ ప్రిస్టీ, రాజేష్ దేశాయ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహానందరెడ్డి ఖబడ్దార్.. ఎమ్మెల్యే అనుకుంటే స్వేచ్ఛగా తిరిగేవాడివా...

### -తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మినరసింహ సూటిప్రశ్న


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుయువత, ఎస్సీఎస్టీ సెల్ నాయకులు

**అనంతపురం సెప్టెంబరు 24 ప్రభాతవార్త**

మహానందరెడ్డి ఖబడ్దార్.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుకుంటే నీవు నగరంలో స్వేచ్ఛగా తిరిగేవాడివా... అంటూ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ ప్రశ్నించాడు. బుధవారం అర్బన్ టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయనతో పాటు ఎస్సీ సెల్ నాయకులు నాగార్జున, శివ, ఎస్టీ సెల్ నాయకులు జయరాం నాయక్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సాకే లక్ష్మీనరసింహ మాట్లాడుతూ మహానందరెడ్డి రౌడీషీటర్ కాబట్టి పోలీసలు చట్ట ప్రకారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారన్నాడు. గత వైసిపి ప్రభుత్వంలో ఎన్ని మార్లు పోలీస్‌స్టేషన్లకు వెళ్లావో గుర్తులేదా, ఇపుడు స్టేషన్‌కు పలిపిస్తే దీని వెనుక ఎమ్మెల్యే దగ్గుపాటి హత్యకు కుట్ర చేస్తున్నాడని చెప్పడం హాస్యాస్పదంగా వుందన్నాడు. నీ అన్న ప్రసాద్‌రెడ్డి వ్యక్తిగత కక్షల వల్ల హత్య చేయబడితే దగ్గుపాటి ప్రసాద్ వున్నాడుని ఆరోపణలు చేశారు. ఈ కేసులో దగ్గుపాటి ప్రమేయం ఏమిలేదని న్యాయస్థానమే నిర్ధారించిన విషయం తెలియదా, సూపర్‌సిక్స్ మహాసభ పార్కింగ్ కోసం స్థలం తీసుకున్నపుడు అక్కడ వున్నవారికి ఏమైనా నష్ట వాటిల్లి వుంటే వాటికి అధికారుల ద్వారా అంచనా వేయమని ఎమ్మెల్యే ఆదేశాలు జారీచేశాడని, సభకు ఎమ్మెల్యే రూ.12లక్షల వరకు సొంతనిధులతో పరిహారం ముందే చెల్లించాడన్నాడు. ఇప్పటికైనా ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసి చెడ్డపేరు తెస్తే సహించమని ఆయన హెచ్చరించాడు.

## పిజిఆర్ఎస్ అర్జీలు పరిశీలించిన ఆర్డీవో

### - భూ సమస్యలు తో సతమతమవుతున్న ప్రజలు - అర్జీదారులపై అర్ఐ దౌర్జన్యం

### - ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ వీరంగం


ఫిర్యాదుదారుడు పవన్ కళ్యాణ్


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఆర్డీవో వసంత బాబు

**గుమ్మఘట్ట సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

గుమ్మఘట్ట మండలానికి బుధవారం ఆర్డిఓ వసంత బాబు స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని చేరుకొని పిజిఆర్ఎస్ రీఓపెన్ అర్జీలను పరిశీలించారు ఈ సందర్భంగా తహశీల్దార్ రజాక్ వలి డిప్యూటీ తహశీల్దార్ విజయలక్ష్మి తో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ని మండల పరిధిలోని సుమారు 13 అర్జీలు పీజీఆర్ఎస్ లో రీఓపెన్ అయ్యాయని 11 మందిని తహసిల్దార్ కార్యాలయాలకు పిలిపించి అర్జీదారులతో మాట్లాడారు సమస్యలపై ఆరా తీశారు క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలతో సతమవుతమవుతున్న అర్జీదారులకు పరిష్కరిస్తామని తెలిపారు ఈ సందర్భంగా ఆర్డీవో వసంత బాబు వచ్చిన సందర్భంలో సుమారుగా మండల పరిధిలోని ఇతరత్రా సమస్యలతో చేరి వచ్చినటువంటి అర్జీదారులు ఆర్డిఓ వసంత బాబు కలిసి సమస్యలను విన్నవించుకోవాలని ఆశతో ఎదురు చూశారు అయితే రీఓపెన్ అయినటువంటి పీజేఆర్ఎస్ అర్జీదారులు మాత్రమే పరిశీలించి వెళ్లారు ఫిర్యాదులు చేయడానికి కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారులను మండలంలో సుమారు సంవత్సర కాలంలో పెండింగ్లో ఉన్న అర్జీదారులు కూడా చేరి రావడం గమనార్హం గుమ్మగట్ట గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి మీడియా తో మాట్లాడుతూ..248 సర్వే నంబర్ సంబంధించిన గత ఏడాది నుంచి భూ సమస్యతో ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న ఫలితం శూన్యం భూ సమస్యపై ఆఫీసుకు ఫిర్యాదును తీసుకుని వస్తే ఆర్ఐ రామాంజనేయులు అర్జీ పేపర్ ను తీసుకోకుండా పారేసాడు అర్జీ తీసుకోను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో పో అంటూ దౌర్జన్యం చేస్తున్నాడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆర్డిఓ వసంత బాబు ని కలిసి ఫిర్యాదు చేద్దామని వస్తే రెవెన్యూ సిబ్బంది నీ సమస్య ఎవరికి చెప్పవద్దని మాతో మాత్రమే చెప్పుమని బెదిరించడం గమనార్హం రెవెన్యూ శాఖ లో పని చేస్తున్నటువంటి ఆర్ఐ రామాంజినేయులు అర్జీలు పారవేయడం దౌర్జన్యం చేయడం నాకు అవమానం జరిగిందని వాపోయారు ఈ విధంగా మండలంలోని అర్జీదారులు రావాలంటే ఏం మాట్లాడుతారో వారికే తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతారు ఇటువంటి ఆర్ ఐ మండలం లో పని చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అర్జీ దారులను బెదిరించే స్థాయికి దిగజారడం బెదిరించడం దౌర్జన్యం చేయడం మంచిది కాదు ఇలా చేయడం సరి కాదని ఫిర్యాదుదారులు వాపోతున్నారు


అర్జీలు దారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంత బాబు